తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8



## రాష్ట్ర వ్యాప్తంగా తరలివస్తున్న గణనాధులు

- 24 గంటల పాటు కొనసాగుతున్న విగ్రహాల నిమజ్జనం
- పెరుగుతున్న గోదావరితో అధికారుల అప్రమత్తం
- ఒకటే లాంచీ ఏర్పాటుతో నిమజ్జన ప్రక్రియలో ఆలస్యం

**భద్రాచలం సెప్టెంబరు 24 (జనంసాక్షి)** వినాయక చవితి సందర్భంగా రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి విగ్రహాలు భారీగా తరలివస్తున్నాయి. భద్రాచలం పట్టణంతో పాటు రాష్ట్రంలోని కరీంనగర్, నల్గొండ, సూర్యపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని విగ్రహాలతో పాటు భద్రాచలం ప్రాంతంలోని వివిధ మండలాలకు చెందిన విగ్రహాలను గోదావరి తీరంకు తీసుకొస్తున్నారు. దీంతో గోదావరి ఘాట్ల నుంచి డిగ్రీ కళాశాల వరకు వరుసగా క్యూలైన్లో విగ్రహాలు ఉంటున్నాయి. గత రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తున్నా నిమజ్జన ప్రక్రియ 24 గంటల పాటు కొనసాగుతూనే ఉంది. దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు పవిత్ర గోదావరి నది ఉండటంతో గణనాథుల నిమజ్జనానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గోదావరి తీరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి, హారతులు ఇచ్చి గణనాథులకు భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలుకుతున్నారు. "గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా" అంటూ నినాదాలు చేస్తూ విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేస్తున్నారు. నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. గోదావరి ఘాట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, ప్రమాదాలు జరగకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గోదావరి ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులు ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అధికారులు సూచనలు చేస్తున్నారు. నిమజ్జనానికి వచ్చే వాహనాల రాకపోకల నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

విగ్రహాలను తీసుకువచ్చే వాహనాల డ్రైవర్లు, నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. గోదావరి నదిలో లోతైన ప్రాంతాల్లోకి వెళ్లకుండా, చిన్నపిల్లలను నీటి దగ్గరకు తీసుకెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. మరోవైపు గణనాథుల నిమజ్జనాన్ని పురస్కరించు కుని భద్రాచలం గోదావరి ఘాట్ల వద్ద భక్తి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ ప్రాంతాల నుంచి విగ్రహాలు తరలిరావడంతో గోదావరి పరిసరాలు గణేశ నామ స్మరణతో మార్మోగుతున్నాయి. భక్తులు ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొంటుండగా, అధికారులు భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.





## భద్రాచలం కరకట్ట వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

### భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్..

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్24 ( జనం సాక్షి):** భద్రాచలం కరకట్ట వద్ద నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన భద్రతా, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ గురువారం నాడు సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో పాటు సంబంధిత శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించారు.

వర్షాకాలం నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి జాప్యం, అంతరాయం కలగకుండా అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. భక్తుల రాకపోకలు, విగ్రహాల తరలింపు, ట్రాఫిక్ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నిమజ్జన వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో పటిష్ట పోలీసు బందోబస్తు, బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్స్ ఏర్పాటు చేయడంతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది, వైద్య సిబ్బంది, అందుబాటులో ఉండాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేష్ శోభాయాత్ర నిర్వాహకులకు ముందుగానే రూట్ మ్యాప్ వివరాలను స్పష్టంగా తెలియజేయాలని ఎస్పీ సూచించారు. పోలీసు శాఖ సూచించే మార్గాల్లోనే ప్రయాణిస్తూ, ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. శోభాయాత్ర నిర్వాహకులు పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

నిమజ్జన సమయంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు భద్రాచలం బ్రిడ్జి - ఐజీ సెంటర్ - బస్టాండ్ -అంబేద్కర్ సెంటర్ - కూనవరం రోడ్ - డిగ్రీ కాలేజ్ - కరకట్ట - కరకట్ట నిమజ్జన పాయింట్ మార్గంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టారు. కరకట్ట నిమజ్జన పాయింట్ వద్దకు వచ్చే వాహనాల్లో ఇద్దరికి మించి వ్యక్తులు ప్రయాణించకుండా తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహనాలను నిర్దేశిత ప్రాంతాల్లోనే పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా పోలీసు సిబ్బంది సూచించే ప్రత్యామ్నాయ మార్గాలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. నిమజ్జన పాయింట్ వద్ద టపాసులు కాల్చడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. నదిలోకి వార్తా లోపలి పేజీలో



## సూర్యాపేట అభివృద్ధి కోసం బుల్లెట్ ట్రైన్ సాధించి తీరుతాం

**సూర్యాపేట (జనంసాక్షి):** సూర్యాపేట జిల్లా కేంద్రానికి జాతీయ రహదారి 65కు సమాంతరం గా బుల్లెట్ ట్రైన్ సాధించేంత వరకు విశ్రమించేది లేదని పట్టణంలో పలువురు ప్రముఖులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా 42వ రోజు గురువారం వర్షాన్ని లెక్కచేయకుండా దీక్షలో పాల్గొన్న వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి మొదటి అలైన్మెంట్ ను కొనసాగిస్తూ సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని అన్నారు. ఈ దీక్షలో బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. చలమల్ల నరసింహ, వెలుగు వనిత, బూర వెంకటేశ్వర్లు, జర్నలిస్టులు భూపతి రాములు గౌడ్, కందుకూరి యాదగిరి, ఎర్ర అఖిల్, నాగవెల్లి కరుణాకర్, రవీందర్ నాయక్, యర్కచర్ల శోభారాణి, గాలి రామకృష్ణ, తోట లక్ష్మి నరసింహారావు, పగిళ్ల వెంకన్న దీక్షలో పాల్గొనగా వారికి సట్టు నాగయ్య, గుండు శ్రీనివాస్ గౌడ్, నల్లగొండ నాగయ్య సంఘీభావం తెలిపారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి)** అల్పపీడనం ప్రభావంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం ఉభయ జిల్లాల కలెక్టర్లతో ఫోన్ లో మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ప్రజలకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.

## అకాల వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్నేరు వరద పరిస్థితిపై అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో సమీక్ష
- సుడా చైర్మన్ శ్రీ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్



**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి)** వర్షాలు కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు, ఇతర విద్యుత్ పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిన్నారులు వర్షపు నీటిలోకి వెళ్లకుండా, విద్యుత్ స్తంభాలు, వైర్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. మరోవైపు మున్నేరు వరద పరిస్థితిపై చైర్మన్ సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో వార్తా లోపలి పేజీలో

## తుఫాను వల్ల వచ్చిన సుడిగాలికి నిరాశ్రయులైన వారిని ఆదుకోవాలి : సిపిఎం డిమాండ్

**కొత్తగూడెం క్రైమ్ , సెప్టెంబర్ 24 (జనం సాక్షి):**
నిన్న తుఫాను సందర్భంగా వచ్చిన సుడిగాలికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొరంపల్లి బంజర నుండి సోంపల్లి మీదుగా దంతల బోర ఎస్సీ కాలనీ వరకు వచ్చిన సుడిగాలికి ఆ పరిధిలో ఇండ్లు కరెంటు స్తంభాలు చెట్లు నేలమట్టమైనా యి సుడిగాలికి నిరాశ్రయులైన ప్రజల్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలో దంతలబోర ఎస్సీ కాలనీ లో సుడిగాలి వల్ల నిరాశ్రయులైన ప్రజల్ని పరామర్శించి వారికి ధైర్యాన్ని కల్పించిన సిపిఎం సిపిఎం బృందం. ఈ సందర్భంగా అన్నవరపు సత్యనారాయణ మాట్లాడుతూ సుడిగాలి వలన సుమారు 12 కరెంటు స్తంభాలు వైర్లు తెగిపోయి నేలమట్టం రావడం నాలుగు డీబీలు పడిపోవడనీ మామిడి టేకు వంటి చెట్లు నేలమట్టం రావడం జమాయిల్ తోటలు పడిపోవడం ఇండ్లు రేకులు లేచిపోయి పైకప్పులు కింద పడిపోవడం వంటివి జరిగాయి అని ఆయన అన్నారు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు





కరెంటు స్తంభాలు పడిపోవడం వలన నాలుగు గ్రామాలు అంధకారంలోకి నెట్టివేయబడిందని ఆయన అన్నారు 11 ఇండ్లు పైకప్పులు లేచిపోయి నవి దానితో వారు వర్షంలో తడుస్తూ జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది వారిని వెంటనే పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారిని తరలించాలని కప్పులు లేచిపోయిన ఇండ్లకు యుద్ధ ప్రాతిపదికన రేకులు కొనిచ్చి ఇల్లు నిర్మించాలని ఆయన పేర్కొన్నారు మామిడి తోటలు జమాలి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు రెవెన్యూ ఎలక్ట్రిసిటీ పంచాయతీ రాజ్ అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకి మరింత సౌకర్యం ఏర్పడుతుందని లేకుంటే ఆ గ్రామాలు అంధకారంలో ఉండే





పరిస్థితి ఏర్పడుతుందని ఆయన అన్నారు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండపై వెంకటేశ్వర్లు మండల కార్యదర్శి పాకాల వెంకటరావు నాయకులు తంబల శ్రీనివాసరావు రాంబాబు వర్మ రవి తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్ సంక్షేమంపై వారోత్సవాలు

### వయోవృద్ధుల పట్ల గౌరవం, భద్రత, సంక్షేమం కోసం సీనియర్ సిటిజన్స్ డే వారోత్సవాలు నిర్వహించాలి- జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.పద్మావతి..

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్24 (జనంసాక్షి):**
అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో వయోవృద్ధుల పట్ల అవగాహన, సంరక్షణ, గౌరవం మరియు సంక్షేమం కొరకు ఈనెల 24 నుండి అక్టోబర్ ఒకటి వరకు జిల్లా లో వివిధ కార్యక్రమాలను చేపట్టవలసినదిగా జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం నేటి నుండి వయోవృద్ధుల సంరక్షణ మరియు సాధికారత వారోత్సవాలు ప్రారంభించబడినదని జిల్లా సంక్షేమాధికారి లెనినా తెలిపారు . ఇందులో భాగంగా జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.పద్మావతి వారోత్సవాల పోస్టర్ ని సీనియర్ సిటిజన్స్ తో కలిసి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల సంక్షేమం మరియు సాధికారత వారోత్సవాల పై సంబంధిత శాఖల మధ్య సమన్వయం తో జిల్లాలో ఉన్న వృద్ధాశ్రమాల్లో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలోని గోడలపై ప్రముఖంగా కనిపించేలా వయోవృద్ధుల సంక్షేమ చట్టం గురించి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.



25/09/2026 ఖఉఊఅ, అఉఊఅ మరియు బస్తీ దవాఖానాల పరిధిలోని సంబంధిత అధికారులందరూ తమ పరిధిలో వృద్ధుల కోసం ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలన్నారు.
26/09/2026 జిల్లాలోని ఉన్న 6 వృద్ధాశ్రమాలలో కనీస వసతులు, సౌకర్యాల తనిఖీ, రికార్డుల పరిశీలన, సంబంధిత సి.డి.పి.ఓ.లు, సూపర్వైజర్లు నిర్వహించాలి.
28/09/2026 సైబర్ మోసాలు, ఉ౹ఖ/జఖఎ/బ్యాంకింగ్ భద్రత మరియు డిజిటల్ సేవలు, స్మార్ట్‌ఫోన్‌ల బాధ్యతాయుత వినియోగంపై అవగాహన,
29/09/2026 వయో వృద్ధులను, తాతయ్య-అమ్మమ్మలు/నానమ్మల మధ్య తరాల మధ్య అనుబంధాన్ని పెంపొందించే కార్యక్రమాలను,
అన్ని విద్యా సంస్థలలో నిర్వహించాలి.
30/09/2026 వయో వృద్ధుల కోసం యోగా, ప్రాణాయామం ప్రదర్శన మరియు శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, 'వాకథాన్' ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమాలు,
01/10/2026 జిల్లా స్థాయి 'అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ' వేడుకలు, ఇందులో వయోవృద్ధులను, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులను సన్మానించడం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంభు ప్రసాద్, అడిషనల్ డైరెక్టర్ జిల్లా విద్యాశాఖ, ఎర్రమళ్ళ శ్రీనివాసరావు ఉద్యోగ సంఘాల నేత, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు సందీప్, పి.ఎస్.ఎన్.రెడ్డి, జయరాం, వెంకటేశ్వర్లు, బుచ్చయ్య, నాగేశ్వరరావు, సురేష్, అబ్రహం, లక్ష్మయ్య, రామ స్వామి, కార్యాలయ సిబ్బంది వర ప్రసాద్, నరేష్ మరియు సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.



## భద్రాచలం కరకట్ట వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ప్రమాదకరంగా దిగడం, బారికేడ్లు దాటి వెళ్లడం, నిషేధిత ప్రాంతాల్లో నిలబడటం వంటి చర్యలకు ఎవరూ పాల్పడరాదని సూచించారు. నిమజ్జన విగ్రహాలను తరలించే వాహనాల కదలికలకు అంతరాయం కలగకుండా మార్గాలను ఖాళీగా ఉంచాలని, వాహనదారులు పోలీసుల సూచనలకు అనుగుణంగా ప్రయాణించాలని ఎస్పీ సూచించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భక్తులు, శోభాయాత్ర నిర్వాహకులు పోలీసు శాఖ సూచించే భద్రతా, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, అధికారులకు సహకరించి శాంతియుతంగా, సురక్షిత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో డీఎస్పీ అరుణ్ కుమార్, పోలీసు అధికారులు, రోడ్డు ట్రాన్స్పోర్ట్ అధికారులు, ఇతర శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నారు. మున్నేరు ప్రవాహానికి సంబంధించిన ఎగువ ప్రాంతాలు, మున్నేరులో కలిసే అకేరు, పాలేరు పరివాహక ప్రాంతాలతో పాటు ఖమ్మం రూరల్, పోలేపల్లి, తీర్థాల తదితర పరిసర ప్రాంతాల్లో వర్షపాతం, వరద ఉధృతి, నీటి మట్టం పరిస్థితిపై అధికారులు అందిస్తున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను సుడా చైర్మన్ కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. వర్షాల సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి" అని సుడా చైర్మన్ శ్రీ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రాజీవ్‌నగర్‌లో ముంపు ప్రాంతాల ను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ

**వైరా జనం సాక్షి**



సెప్టెంబర్ 24న వైరా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు రాజీవ్‌నగర్‌లో నిన్న, ఇవాళ కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిని గమనించిన 4వ వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణి రత్నాకర్ వెంటనే మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ వెంటనే స్పందించి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, ఏఈ శ్రీ మాన్య , మేనేజర్ సుధీర్ తో కలిసి రాజీవ్‌నగర్‌లోని ముంపు ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. వర్షపు నీరు ఇళ్లలోకి చేరిన ప్రాంతాలను పరిశీలించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ, ప్రజల భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచనలు చేశారు ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అవసరమైతే గవర్నమెంట్ హైస్కూల్‌కు తరలించి, వారికి అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు . ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ పనితి సైదులు ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపామురళీకృష్ణ ,ముళ్ళపాటి సీతారాములు కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు పాలేటి నరసింహారావు వేముల రత్నాకర్ ఉండ్రు శ్యాంబాబు తోటకూర శ్రీకాంత్ ఉయ్యూరు రామకృష్ణ తదితరులుస్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల బరిలో అలవాల రాజా మాదిగ

**భద్రాచలం సెప్టెంబర్ 24 (జనంసాక్షి)**




ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్నికల్లో సామాజిక ఉద్యమకారుడు అలవాల రాజా మాదిగ పోటీకి సిద్ధమయ్యారు. పేదలు, వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు సేవలందించడంతో పాటు సామాజిక సమస్యలపై పనిచేస్తున్న తన అనుభవంతో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా మరింత సేవ చేయాలనే ఉద్దేశంతో ఎన్నికల బరిలో నిలిచినట్లు ఆయన తెలిపారు. వికలాంగుల పెన్షన్ పెంపు, ఆరోగ్యశ్రీ సాధన, పేదలకు బియ్యం పెంపు తదితర అంశాలపై జరిగిన ఉద్యమాలు, సామాజిక కార్యక్రమాల స్ఫూర్తితో తాను సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వం, ఆలోచనా విధానంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీలో సేవా కార్యక్రమాలను మరింత పారదర్శకంగా, కులమతాలకు అతీతంగా, మానవతా దృక్పథంతో నిర్వహించాల్సిన అవసరం ఉందని రాజా మాదిగ పేర్కొన్నారు. పేదలు, బలహీన వర్గాలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు తనకు ఓటు వేసి ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా అలవాల రాజా మాదిగ కోరారు.

# చిన్నపాటి వర్షానికే వాగును తలపిస్తున్న రహదారి

## ఎస్సీ మాల కాలనీలో సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికుల డిమాండ్

**అశ్వాపురం సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** మల్లెలమడుగు ఎస్సీ మాల కాలనీలో చిన్నపాటి వర్షానికే రహదారులపై నీరు నిలిచి వాగును తలపిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.బల్ల తిరుమలరావు మాట్లాడుతూ.. వర్షం పడిన ప్రతిసారీ తమ ఇంటి చుట్టూ నీరు నిలిచి, దోమలు, విషపురుగుల బెడద పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు బయటకు వెళ్లేందుకు కాలువ ఏర్పాటు చేసి, రహదారిని సీసీ రోడ్డుగా నిర్మించాలని కోరారు.

మొహమ్మద్ చాంద్ మాట్లాడుతూ.. ఇంటి ముందు, చుట్టుపక్కల వర్షపు నీరు నిలవడంతో చిన్నపిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీటిలో నుంచి వెళ్లాల్సి రావడంతో పిల్లల బట్టలు తడవడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారి, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.పిట్టా లక్ష్మి ఇంటి నుంచి గొర్రెముచ్చు కృష్ణ ఇంటి వరకు రహదారిని వెంటనే సీసీ రోడ్డుగా నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.







గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# కాంతి లేని కాంగ్రెస్ పాలన.. చీకట్లో తెలంగాణ!

**కాలిపోతున్న మోటర్లు.. ఎండిపోతున్న పంటలు...**

**కరెంటు కోతలతో పల్లెల్లో ఆవేదన పట్టణాల్లో ఉక్క పోత..**

**మణుగూరు సెప్టెంబర్ 24 (జనం సాక్షి):** తెలంగాణవ్యాప్తంగా కరెంట్ కోతలు, కాలిపోతున్న మోటర్లు, ఎండిపోతున్న పంటలు.. వెరసి రాష్ట్రం మళ్లీ చీకటి రోజుల్లోకి వెళ్తోందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. గురువారం బిఆర్ఎస్ మాజీ మంత్రి పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు. మణుగూరు బి టి పి ఎస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అజయ్ కుమార్ మాట్లాడుతూ...24 గంటల కరెంట్.. రైతుల కళ్లల్లో ఆనందం.. ఇవన్నీ నిన్నటి మాటలు. నేడు తెలంగాణవ్యాప్తంగా కరెంట్ కోతలు, కాలిపోతున్న మోటర్లు, ఎండిపోతున్న పంటలు.. వెరసి రాష్ట్రం మళ్లీ చీకటి రోజుల్లోకి వెళ్తోంది.రాష్ట్రంలో ఎక్కడ చూసినా అప్రకటిత కరెంట్ కోతలు సామాన్యులను, రైతులను బలితీసుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి విద్యుత్ రంగంలో స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం, బొగ్గు కొరతను నిర్వహించడంలో ఘోర వైఫల్యం చెందడమే నేటి ఈ సంక్షోభానికి అసలు కారణం.బొగ్గు 'కుంభకోణం'.. పడిపోయిన విద్యుత్ ఉత్పత్తి!రాష్ట్రంలోని ప్రధాన థర్మల్ పవర్ ప్లాంట్లు నేడు మూలనపడే స్థితికి వచ్చాయి. నాణ్యత లేని బొగ్గును అధిక ధరలకు కొనుగోలు చేయడం వల్ల ప్రభుత్వ ఖజానాకు 2,900 కోట్ల మేర నష్టం వాటిల్లడమే కాకుండా, ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం దారుణంగా పడి పోయిందన్నారు .

**పవర్ ప్లాంట్లలో సంక్షోభం:**

కొత్తగూడెం (కేటీపీఎస్), మణుగూరు (బి టి పి ఎస్), భూపాలపల్లి (కే టి పిపి) వంటి కీలక కేంద్రాలలో బొగ్గు కొరత వల్ల రోజువారీ ఉత్పత్తి సగానికి పైగా క్షీణించింది. ఒకవైపు పవర్ ప్లాంట్లలో సంక్షోభం నడుస్తుంటే, మరోవైపు గ్రిడ్ మేనేజ్‌మెంట్ లో అధికారుల సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.చేతులెత్తేసిన వ్యవసాయం.. ఎండిపోతున్న పంటలు వ్యవసాయానికి విఘాతం 'ఉచిత విద్యుత్' అని ప్రగల్భాలు పలికిన పాలకులు, నేడు గ్రామాల్లో కనీసం 6 నుంచి 8 గంటలు కూడా సరిగ్గా విద్యుత్ ఇవ్వలేక పోతున్నారు.మోటర్లు కాలిపోతున్నాయి: లో-వోల్టేజ్ సమస్యలు, అర్ధరాత్రి పూట అకస్మాత్తుగా వచ్చే కరెంట్ కోతల వల్ల వేలాది రూపాయలు ఖర్చు చేసి పెట్టుకున్న రైతుల మోటర్లు కాలిపోతున్నాయి. రైతుల జీవితాల్లో చీకటి రోజులు వచ్చేశాయి.

**ఆందోళనలో రైతాంగం:**

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు లేక సాగునీరు అందక ఎకరాకు ఎకరాలు వరి, ఇతర పంటలు పొలాల్లోనే ఎండి పోతున్నాయి. బోరు బావుల ద్వారా నైనా పొలంలో నీరు పెడదాం అనుకుంటే కరెంటు కోతలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నీరు లేకపోతే తాము పడిన కష్టమంతా బుగ్గిపాలవుతోందని రైతులు సబ్‌స్టేషన్ల ముందే ధర్నాలకు దిగుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇది ఇలానే కొనసాగితే బతకలేక గతం లోని సమస్య మళ్ళీ పునరావతం అవుతుందన్నారు

**నగరాల్లో ఉక్కపోత.:**

పరిశ్రమల్లో నిశ్శబ్దం ఈ కరెంట్ సెగ కేవలం పల్లెలకే పరిమితం కాలేదు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో కూడా రోజుకు 3 నుంచి 4 గంటల పాటు అప్రకటిత కోతలు విధిస్తున్నారు.పీక్ అవర్స్‌లో కరెంట్ పోతుండటంతో గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఐటీ కంపెనీలు, చిన్నతరహా పరిశ్రమలు జనరేటర్ల నిర్వహణ ఖర్చులు భరించలేక విలవిల్లాడుతున్నాయి. విద్యుత్ నమ్మకం కోల్పోవడంతో కొత్త పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేందుకు వెనకాడుతున్నాయి.ప్రశ్నిస్తే గృహనిర్బంధాలా? పోలీసుల కాపలానా? ఈ ప్రజాసమస్యలపై బీఆర్ఎస్ పవర్ ప్లాంట్ల వద్ద శాంతియుతంగా మహాధర్నాలు చేస్తుంటే, ప్రభుత్వం వారిని ప్రజాస్వామ్యయుతంగా ఎదుర్కోలేక పోలీసు బలగాలను ప్రయోగిస్తోంది. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను ముందస్తు గృహనిర్బంధాలు చేయడం, పవర్ ప్లాంట్ల వద్ద ముళ్లకంచెలు వేసి అడ్డుకోవడం చూస్తుంటే, ప్రభుత్వం తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ప్రయత్నిస్తోందని స్పష్టమవుతోంది.

**బిఆర్ఎస్ డిమాండ్:**

సమీక్షలు, ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రభుత్వం తక్షణమే కోల్ ఇండియా నుండి బొగ్గు సరఫరాను పునరుద్ధరించాలి. పెరిగిన 19,543 మెగావాట్ల రికార్డు డిమాండ్‌ను తట్టుకునేలా పక్కా ప్రణాళికతో అదనపు విద్యుత్‌ను కొనుగోలు చేసి రాష్ట్రానికి మునుపటిలా 24 గంటల నిరంతర నాణ్యమైన కరెంట్‌ను అందించాలి. లేనిపక్షంలో, ఈ కరెంట్ మంటలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దహించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు,బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# రూ.2,700 క్యాన్సర్ మందు రూ.27 వేలా?

**○కార్పొరేట్ దోపిడిపై సిపిఐ నేత బెజవాడ రవిబాబు ఆగ్రహం!**

**○సుప్రీంకోర్టు వ్యాఖ్యలే కనువిప్పు.. వ్యవస్థలో సమూల మార్పులు రావాలి!**

**○పెట్రోల్, డీజిల్, మద్యంపై పన్నుల మోత.. సామాన్యుడి నడ్డి విరుస్తున్న ప్రభుత్వాలు!**

**మధిర (జనంసాక్షి):** దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న వైద్య ఖర్చులు, పన్నుల భారంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు అక్షరసత్యాలని సీపీఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు అన్నారు.క్యాన్సర్ మందుల ధరల పెంపుపై సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యక్తం చేసిన ఆగ్రహం.. దేశంలో ప్రైవేట్, కార్పొరేట్ దోపిడీకి అద్దం పడుతోందని ఆయన విశ్లేషించారు.ఈ మేరకు సుప్రీంకోర్టు వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఆయన గురువారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు.

**నియంత్రణ లేని వైద్యం..నిలువుదోపిడీకి వేదిక!**

కంపెనీలో కేవలం రూ.2,700కే తయారవుతున్న క్యాన్సర్ మందులను రిటైలర్లు రూ.27,000కు అమ్ముతూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని రవిబాబు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులు చికిత్స కోసం ఇళ్లు,భూములు అమ్ముకుంటున్నా..నియంత్రించాల్సిన అధికారులు మౌనంగా ఉండటం దారుణమన్నారు. ఇది ఒక్క మందు ధరల సమస్య మాత్రమే కాదని, మన వ్యవస్థ మొత్తం రోగగ్రస్తమైందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**జీఎస్టీ పన్నుల మోత.. సామాన్యుడిపై భారాలు!**

ప్రస్తుత జీఎస్టీ విధానంపై మండిపడుతూ.. పాలు, కూరగాయల నుంచి ప్రాణాధార మందుల వరకు అన్నింటిపై పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వాలు, పెట్రోల్, డీజిల్,మద్యాన్ని మాత్రం ఆ పరిధిలోకి ఎందుకు తెవడం లేదని ప్రశ్నించారు. ఇవి జీఎస్టీ పరిధిలోకి వస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాబడి తగ్గుతుందనే ఉద్దేశంతోనే వాటిని కావాలనే బయట ఉంచారని, దీనివల్ల సామాన్యుడిపై విపరీతమైన భారం పడుతోందని విమర్శించారు. సామాన్యుడు కొనుగోలు చేసే పెట్రోలు, డీజిల్‌లో దాదాపు సగం పైగా ధర పన్నుల రూపంలోనే ప్రభుత్వాల పాలవుతోందన్నారు.




**కమిషన్ల కోసం ప్రాణాలతో చెలగాటం!**

వైద్య రంగంలోనూ దళారుల రాజ్యం నడుస్తోందని రవి బాబు ధ్వజమెత్తారు. రోడ్డు ప్రమాదం జరిగితే క్షత గాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన అంబులెన్సులు, కమిషన్ల కక్కుర్తితో ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి నిలువుదోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. ఆర్‌ఎంపీల నుంచి కార్పొరేట్ వైద్యుల వరకు రిఫరల్ కమిషన్ల సంస్కృతి పెరిగిపోయిందని, రోగుల బల హీనతను ఆసరా చేసుకుని బ్రాండెడ్ మందుల పేరు తోనూ దోచుకుంటున్నారని ఆరోపించారు.ఈ దోపిడీ వ్యవస్థ పూర్తిగా అంతం కావాలంటే ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయే దాకా విద్య, వైద్యం, ఉపాధి బాధ్యతలను ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. అప్పుడే దేశంలో ఈ దోపిడీలు, విచ్చలవిడితనం ఆగిపోతాయని బెజవాడ రవిబాబు అన్నారు.

# పాలకుల శిలాఫలకం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

**○ రెండు కిలోమీటర్ల దూరానికి.. 12 కిలోమీటర్ల నరక ప్రయాణం ○కొక్కిరేణి - ఎర్రగడ్డ మధ్య తెగిపోయిన రవాణా సౌకర్యం ○ ఏడాది దాటినా అడుగు ముందుకు పడని వంతెన నిర్మాణం**



**తిరుమలాయపాలెం సెప్టెంబర్ 24 (జనం సాక్షి)**

కంటి చూపు మేరలో చూస్తే.. కేవలం రెండు కిలోమీటర్ల దూరం గట్టిగా అరిస్తే అవతలి గ్రామానికి వినిపించేంత సాన్నిహిత్యం. కానీ, ఇప్పుడు ఆ రెండు గ్రామాలకు వెళ్లాలంటే మాత్రం సుమారు 10 నుంచి 12 కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడింది. తిరుమలాయపాలెం మండల పరిధిలోని కొక్కిరేణి, ఎర్రగడ్డ గ్రామాల ప్రజల పాలిట కాంట్రాక్టర్ నిర్లక్ష్యం శాపంగా మారింది.

గత 2024వ సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు కొక్కిరేణి, ఎర్రగడ్డ గ్రామాల మధ్య ఉన్న వంతెన పక్కన మట్టి కొట్టుకుపోయి రోడ్డు పూర్తిగా తెగిపోయింది. దీంతో అప్పట్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజా సమస్యను గుర్తించిన ప్రభుత్వం, వంతెన పునర్నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. గౌరవ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ వంతెన నిర్మాణానికి శిలాఫలకం కూడా వేశారు.

**ఎండకాలం నిద్రపోయి.. వానాకాలం మేల్కొన్నారు**

మంత్రి గారు శంకుస్థాపన చేసి సుమారు ఏడాది కావస్తున్నా పనుల్లో ఎలాంటి చలనం లేదు. వంతెన పనులు ప్రారంభించడానికి అద్భుతమైన వేసవికాలం అంతా అందుబాటులో ఉన్నా.. కాంట్రాక్టర్ మాత్రం 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరించారు. తీరా ఇప్పుడు వర్షాలు పడుతున్న సమయంలో, అంతంత మాత్రంగా ఉన్న పాత వంతెనను పూర్తిగా తొలగించారు. ప్రత్యామ్నాయంగా పంట పొలాల గుండా చిన్న మోరీలు (పైపులు) వేసి, పైన మట్టి పోసి ఒక తాత్కాలిక కాలిబాటను ఏర్పాటు చేశారు.

**నిర్లక్ష్యపు మోరీలపై.. రెండు మీటర్ల వరద**

గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కాంట్రాక్టర్ వేసిన తాత్కాలిక మోరీల పైనుంచి సుమారు రెండు మీటర్ల ఎత్తున వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అత్యవసర పనుల కోసం వెళ్లాలన్నా, విద్యార్థులు స్కూళ్లకు వెళ్లాలన్నా కిలోమీటర్ల కొద్దీ చుట్టూ తిరిగి నరకయాతన అనుభవిస్తున్నారు.

**కొంచెం ఆలోచించి ఉంటే.. ఇంత కష్టం వచ్చేదా**

ఈ దుస్థితికి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని స్థానికులు మండిపడుతున్నారు. పనులను వేసవిలోనే పూర్తి చేయాల్సింది పోయి ఇప్పుడు మొదలుపెట్టడం ఒక తప్పయితే.. ప్రత్యామ్నాయ మార్గమైన కాలిబాటను కనీస అవగాహన లేకుండా నిర్మించడం మరో తప్పు. ఆ తాత్కాలిక దారిని కొంచెం ఎత్తుగా చేసి, రెండుకు బదులు మూడు లేదా నాలుగు మోరీలు వేసి ఉంటే, వరద వచ్చినా నీరు కింద నుంచి వెళ్లిపోయేది. ప్రయాణానికి ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. కాంట్రాక్టర్ చేసిన చిన్న పొరపాటుకు.. ఇప్పుడు రెండు గ్రామాల ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి, తాత్కాలిక కాలిబాటను పునరుద్ధరించడంతో పాటు, వంతెన నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కొక్కిరేణి, ఎర్రగడ్డ గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# లింగ సమానత్వంతోనే సమగ్ర అభివృద్ధి

## యువతకు అవగాహన కల్పించిన నీడ్స్ సంస్థ



**ఆత్మకూర్ (ఎం)సెప్టెంబర్ (24) జనంసాక్షి** మండలంలోని తిమ్మాపురం గ్రామంలో బోస్కో సేవా సంస్థ, విలీడ్ సహకారంతో 'నీడ్స్' మంచి పరిసరాలు విద్యా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం యువతీ యువకులకు లింగ సమానత్వం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, యువత అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీడ్స్ సంస్థ అధ్యక్షులు కానుగంటి శ్రీశైలం మాట్లాడుతూ లింగ సమానత్వం సాధించడం యువత సమగ్ర అభివృద్ధితో పాటు దేశాభివృద్ధికి ఎంతో కీలకమన్నారు. నేటి యువత రేపటి పౌరులు మాత్రమే కాకుండా సామాజిక మార్పుకు ప్రధాన శక్తిగా నిలవాలని సూచించారు. యువతులు విద్య, ఉద్యోగ రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని తెలిపారు.. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, ఆయా, యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ జిల్లా డైరెక్టర్‌గా పూర్ణచందర్ రాజు నామినేషన్



**ఆత్మకూర్ (ఎం) సెప్టెంబర్ (24) జనంసాక్షి** యాదాద్రి భువనగిరి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్ పదవికి ఆత్మకూర్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, రెడ్‌క్రాస్ సీనియర్ సభ్యుడు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు అక్టోబర్ 4న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోలిపురం ఎల్లారెడ్డి, జెట్ట యాదగిరి, కొత్తకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



### సెప్టెంబర్ 30లోగా

# డిజిటల్ పంట నమోదు

**ఆత్మకూర్ (ఎం) సెప్టెంబర్ (24) జనంసాక్షి**
మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో కొనసాగుతున్న డిజిటల్ పంట నమోదు ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ముప్పిడి అశోక్ కుమార్ సూచించారు. ప్రభుత్వం నియమించిన సిబ్బంది రైతుల పొలాలను సందర్శించి సర్వే నంబర్, సాగు విస్తీర్ణం, పంట రకం తదితర వివరాలను డిజిటల్‌గా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు వరి, పత్తి, కంది తదితర పంటల వివరాలను సిబ్బందికి స్వయంగా తెలియజేసి, ప్రతి సర్వే నంబర్‌లో పంట వివరాలు సరిగ్గా నమోదయ్యేలా చూసుకోవాలని కోరారు. సర్వే సమయంలో రైతులు పొలాల వద్ద అందుబాటులో ఉండి సిబ్బందికి సహకరించాలని సూచించారు. ముఖ్యంగా సన్న రకాల వరి సాగు చేస్తున్న రైతులు పంట రకం, సాగు విస్తీర్ణాన్ని తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. పంట వివరాలు నమోదైన అనంతరం రైతులకు మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని, సర్వే జరిగిన 72 గంటల్లోపు ఏవైనా తప్పులు ఉంటే స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి సవరణలు చేసుకోవచ్చని తెలిపారు. 72 గంటల అనంతరం నమోదైన వివరాలను ప్రామాణికంగా పరిగణించే అవకాశం ఉందన్నారు.పంట నమోదు వివరాలు పంట కొనుగోలు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, ఇతర సేవలకు ప్రామాణికంగా ఉపయోగపడనున్నందున రైతులు నిర్లక్ష్యం చేయవద్దని అశోక్ కుమార్ కోరారు. డిజిటల్ పంట నమోదుకు సెప్టెంబర్ 30 చివరి తేదీ కావడంతో గడువు కోసం వేచి చూడకుండా ఇప్పటివరకు నమోదు చేయించుకోని రైతులు వెంటనే సంబంధిత సిబ్బందిని సంప్రదించి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. సందేహాలు, సమస్యలు ఉంటే సమీపంలోని రైతువేదికను సంప్రదించాలని కోరారు.



### వి.బీ.నగర్ లడ్డూను వేలంలో

# దక్కించుకున్న మండల శ్రీనివాస్

**తిరుమలగిరి (సాగర్), సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
హాలియా పట్టణంలోని 7వ వార్డు వి.బీ.నగర్‌లో శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ గణేష్ యూత్ (మామిడి చెట్టు) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూ వేలం పాట నిర్వహించారు.ఈ వేలం పాటలో తిరుమలగిరి సాగర్ మండలం బోయగూడం గ్రామానికి చెందిన మండల శ్రీనివాస్?సుజాత దంపతులు అత్యధిక ధర రూ.40,116లకు లడ్డూను దక్కించుకున్నారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో వేలం పాట ఉత్సాహంగా సాగింది.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వెంకన్న, గావుల శ్రీను, వీరబోయిన నవీన్ యాదవ్, సాలయ్య యాదవ్, అశోక్, తక్కెలపల్లి కృష్ణ, వెంకటయ్య, శ్రీరామ్ యాదవ్, వీరబోయిన ప్రవీణ్ తదితరులు, భక్తులు పాల్గొన్నారు.

# ఈ నెల 27న సూర్యాపేటలో ఉచిత వైద్య శిబిరం

**సూర్యాపేట (జనంసాక్షి):**
లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట కంటి ఆసుపత్రి, ప్రముఖ యశోద హాస్పిటల్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27న సూర్యాపేటలో మహా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ సూర్యాపేట కంటి ఆసుపత్రి చైర్మన్ మీలా మహాదేవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ఉచిత వైద్య శిబిరం ఈ నెల 27న లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట కంటి ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులచే ఉచిత కంటి పరీక్షలు, షుగర్, బిపి, 2డి ఇకో, ఈసీజీ, లిపిడ్ ప్రొఫైల్, గుండె వైద్య పరీక్షలు, స్త్రీ వైద్య పరీక్షలు, ఎముకల వైద్య పరీక్షలు, రక్తనాళాల పరీక్షలు, జనరల్ కన్సల్టేషన్ నిర్వహించబడునని తెలిపారు.సూర్యాపేట పట్టణ, పరిసర గ్రామాల ప్రజలందరూ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఆయుర్వేదంతో ఆరోగ్య పరిరక్షణ

## ఆత్మకూరులో ఉచిత వైద్య శిబిరం

**ఆత్మకూర్ (ఎం):జనంసాక్షి సెప్టెంబర్ (24)**
జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూర్ మండల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి, సైలజా రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు.అనంతరం ధన్వంతరి భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, సర్పంచ్ బీసు ధనలక్ష్మి, ఉపసర్పంచ్ నరేష్, సీనియర్ ఆయుర్వేద వైద్యులు డా. కన్నయ్య పాల్గొని ఆయుర్వేద వైద్య విధానం ప్రాముఖ్యతను వివరించారు. ఆయుర్వేదంతో ఆరోగ్య పరిరక్షణ, వ్యాధి నిరోధక శక్తి పెంపు, యోగ, ధ్యానం, ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన గ్రామ ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బందిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, గ్రామ ప్రజలు, వైద్య సిబ్బంది, ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఇంటివద్దే వినాయక నిమజ్జనం

- ఇంటి వద్దే మట్టి విగ్రహాన్ని కరిగించి.. మట్టితో పాటు తులసి, మారేడు మొక్కల పంపిణీ
- నీటి వనరులను కలుషితం చేయకుండా పర్యావరణహిత నిమజ్జనం
- మట్టి వృథా కాకుండా మొక్కల పెంపకానికి వినియోగం
- తోపుచర్లలో ముత్యాలమ్మ గుడి కమిటీ ఆదర్శ కార్యక్రమం



**మాడుగులపల్లి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం-పరిశుభ్రతే ధ్యేయంగా మాడుగులపల్లి మండలం తోపుచర్ల గ్రామంలో ముత్యాలమ్మ గుడి కమిటీ సభ్యులు ఆదర్శవంతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో ప్రతిష్టించిన మట్టి వినాయకుడికి తొమ్మిది రోజుల పాటు నవరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు అనంతరం ఆ విగ్రహాన్ని ఇతర నీటి వనరుల్లో కాకుండా తమ కళ్ల ముందే నిమజ్జనం చేయాలని నిర్ణయించారు ఈ క్రమంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మట్టి విగ్రహం పూర్తిగా తడవగా, కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు మరికొన్ని నీరు చేర్చి విగ్రహాన్ని ముద్దగా మార్చారు

**మట్టి పంపిణీ - మొక్కల పెంపకం**
కరిగిన మట్టిని వృథాగా పడేయకుండా కమిటీ సభ్యులు ఆ మట్టిని తమలో తాము పంచుకున్నారు అంతేకాకుండా, ఆ మట్టితో పాటు తులసి, మారేడు మొక్కలను గ్రామస్తులకు పంపిణీ చేసి, వాటిని నాటి సంరక్షించే బాధ్యతను కూడా స్వీకరించారు.

ఈ వినూత్న పర్యావరణహిత కార్యక్రమాన్ని గ్రామస్తులు గడ్డం పురుషోత్తం రెడ్డి, మాజీ జడ్పిటిసి పుల్లెంల సైదులు, మాడుగుల పల్లి సర్పంచ్ అరూరి నరేష్ లింగయ్య, నాగిళ్ల లింగయ్య, కంపసాటి కనకయ్య, నన్నెబోయిన లింగయ్య, సంద్రాల సతీష్, సకినాల యాదగిరి, బొమ్మపాలెం రవి తదితరులు ముందుండి నిర్వహించారు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడిన ఈ ప్రయత్నాన్ని పలువురు గ్రామస్తులు అభినందించారు.

# ప్రాణం పోస్తున్న 'పరీక్ష'

❍ ఖమ్మం సర్కారు దవాఖానలో 'పాథాలజీ' విప్లవం
❍ ఏడాదే 1.78 లక్షల రోగ నిర్ధారణలు
❍ కేన్సర్ నుంచి రక్తహీనత వరకు ముందస్తు గుర్తింపు
❍ కార్పొరేట్ దీటుగా సేవలు.. పేదలకు వరంగా మారిన ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి





**ఖమ్మం బ్యూరో, (జనంసాక్షి) :** ఒకప్పుడు ఏదైనా పెద్ద జబ్బు చేసిందంటే చాలు.. ఖచ్చితమైన నిర్ధారణ కోసం వేలకు వేలు గుమ్మరించి ప్రైవేటు ల్యాబ్‌లకు పరుగులు తీయాల్సిన దుస్థితి. సరైన సమయానికి పరీక్ష నివేదిక అందక, రోగమేమిటో తేలీక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలూ కోకొల్లలు. ఇప్పుడు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) ఆ చీకట్లను తుడిచిపెట్టేసింది. అత్యాధునిక సాంకేతికత, అంకితభావంతో పనిచేసే వైద్యుల బృందం కలగలసి ఇక్కడి పాథాలజీ విభాగాన్ని రోగుల ప్రాణ రక్షణ కవచంగా తీర్చిదిద్దాయి. ప్రస్తుత 2026 సంవత్సరంలో ఇప్పటివరకు ఏకంగా 1.78 లక్షలకు పైగా వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు పూర్తి చేసి, నిరుపేదల ఆరోగ్యానికి భరోసాగా నిలిచింది.

**సకాలంలో పసిగట్టి.. సరైన దారి చూపి..**

జబ్బు ముదిరిన తర్వాత ఇచ్చే ఖరీదైన చికిత్స కంటే, ఆరంభంలోనే గుర్తించి తుంచేసే పరీక్షే రోగికి అసలైన సంజీవని. ఈ సూత్రాన్నే పాటిస్తోంది ఖమ్మం పాథాలజీ విభాగం. ఇక్కడ నిత్యం నిర్వహించే రక్త, శారీరక ద్రవాల పరీక్షలు వైద్యులకు రోగి చికిత్సా ప్రణాళికను రూపొందించడంలో దిక్సూచిలా పని చేస్తున్నాయి. ఇందులో ప్రధానంగా రక్త సంబంధిత వ్యాధులు, తీవ్ర రక్తహీనతను గుర్తించేందుకు నిర్వహించిన హిమటాలజీ పరీక్షలే ఏకంగా 1.60 లక్షలు దాటడం విశేషం. 65 వేలకు పైగా సీబీపీ, మరో 65 వేల హెచ్‌బీ పరీక్షలతో పాటు రక్తవర్గీకరణ, రక్తస్రావ సమయాన్ని అంచనా వేసే పరీక్షలను వేగంగా పూర్తి చేశారు. మరోవైపు అంతర్గత ఇన్ఫెక్షన్లు, ఇతర అవయవ సమస్యలను గుర్తించేందుకు క్లినికల్ పాథాలజీ విభాగం ద్వారా శరీర ద్రవాల విశ్లేషణ, మూత్ర పరీక్షలు కలిపి 15 వేలకు పైగా పూర్తి చేసి రోగులకు ప్రాథమిక దశలోనే ఊరట కల్పించారు.

**కేన్సర్ ముప్పునకు తొలి అడుగులోనే చెక్**

సమాజాన్ని భయకంపితులను చేస్తున్న కేన్సర్ మహమ్మారిని తొలి దశలోనే పసిగట్టేందుకు ఇక్కడి సైటోపాథాలజీ, హిస్టోపాథాలజీ విభాగాలు అద్భుత పనితీరును కనబరుస్తున్నాయి. శరీరంలో ఏర్పడే అనుమానాస్పద గడ్డల స్వభావాన్ని కనిపెట్టే ఎఫ్ఎన్ఏసీ పరీక్షలు 901 మందికి నిర్వహించారు. ముఖ్యంగా మహిళలను కలవరపెట్టే రొమ్ము గడ్డలు, లింఫ్ నోడ్స్‌లలో ప్రమాదకర మార్పులను ఈ పరీక్షలు బట్టబయలు చేశాయి. అలాగే మహిళల ప్రాణాల మీదకు తెచ్చే గర్భాశయ ముఖద్వార (సర్వికల్) కేన్సర్‌ను ఆదిలోనే తరిమికొట్టేందుకు 902 పాప్ స్మియర్ పరీక్షలు చేశారు. ఇంకా లోతైన నిర్ధారణ అవసరమైన సందర్భాల్లో 550 బయాప్సీ నమూనాలను సూక్ష్మదర్శిని కింద పరిశీలించి, కణజాల ఆధారిత స్పష్టతను అందించారు. సర్వికల్ బయాప్సీల ద్వారా 'సిన్-2', 'సిన్-3' వంటి ముందస్తు గాయాల దశలోనే వ్యాధిని పట్టుకోవడంతో, అది ఇన్వేసివ్ కేన్సర్‌గా మారకముందే రోగులను కాపాడటం సాధ్యమైంది. గర్భాశయ రక్తస్రావ సమస్యలు, చర్మం, మృదుకణజాల సంబంధిత వ్యాధులను సైతం బయాప్సీల ద్వారా తేల్చి చెప్పి అవసరమైన వారికి సకాలంలో సూపర్ స్పెషాలిటీ చికిత్సలు అందేలా చేస్తున్నారు.

**పిల్లల రక్త రుగ్మతలకు ఆధునిక కళ్లెం**

చిన్నారి జీవితాల్లో చీకట్లు నింపే జన్యుపరమైన, వంశపారంపర్య రక్త సమస్యలను కనిపెట్టడంలో ఈ విభాగం ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. పెరిఫెరల్ బ్లడ్ స్మియర్ పరీక్షల ద్వారా ఎర్ర, తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్ల ఆకృతిని నిశితంగా పరిశీలిస్తున్నారు. అనుమానం వచ్చిన వెంటనే పిల్లలు, యువతలో కనిపించే థలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వంటి జబ్బులను అధునాతన హెచ్‌పీఎల్‌సీ పరీక్షల ద్వారా నిర్ధారిస్తున్నారు. దీనివల్ల వ్యాధి నిర్ధారణతో పాటు ఆయా కుటుంబాలకు జన్యు సలహాలు (జెనెటిక్ కౌన్సెలింగ్) అందించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం తేలికవుతోంది.

**సమన్వయంతోనే సాధ్యమైన మార్పు**

జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. నిరంతర పర్యవేక్షణ, డిప్యూటీ సీఎం, స్థానిక మంత్రులు, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల ప్రత్యేక చొరవ ఈ విజయానికి ప్రధాన ఇంధనంగా నిలిచాయి. పరీక్షల నిర్వహణ దగ్గరి నుంచి ఫలితాలు అందించడం, అక్కడి నుంచి సూపర్ స్పెషాలిటీ కేంద్రాలకు రిఫర్ చేయడం, ఆ తర్వాత రోగి ఫాలోఅప్ వరకు ఒక సమగ్ర గొలుసుకట్టు విధానాన్ని అమలు చేస్తున్నారు. ఫలితంగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నేడు ఉమ్మడి జిల్లా ప్రజలతో పాటు సరిహద్దు ప్రాంతాల నిరుపేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చే జీవనరేఖగా రూపుదిద్దుకుంది.

## గత ప్రభుత్వం మాదిరిగానే మొండిగోడలకు డ్రా తీసి ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

**డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి అర్హులకు ఇవ్వాలి**

**సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు డిమాండ్**

**ఎమ్మెల్యేకు సిపిఎం వినతి**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 24(జనంసాక్షి):** డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తి కాకుండానే గత ప్రభుత్వం మాదిరిగానే మొండిగోడలకు డ్రా తీసి ప్రజలను మోసం చేస్తున్నారని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు ఆరోపించారు.స్తానిక కొత్తగూడెం క్లబ్ లో డబుల్ బెడ్ రూం లబ్ధిదారుల ఎంపిక సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 2023 సంవత్సరం మార్చిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు డ్రా తీశారనీ ఆనాడు ఇల్లు పూర్తి కాకుండానే మొండి గోడలకు డ్రా తీసి ప్రజలను మోసం చేశారని అన్నారు. నేటికీ లబ్ధిదారులకు ఇల్లు చూపించలేదనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు డ్రా తీసినప్పుడు ఇల్ల నిర్మాణం పూర్తి కాకుండానే హడావుడిగా అధికారులు, స్థానిక కౌన్సిలర్లు కలిసి డ్రా తీసి ప్రజలను మోసం చేశారని,తిరిగి ఇప్పుడు కూడా డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి కాకుండానే అధికారులు హడావుడిగా డ్రా తీసి ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నారనీ ఆరోపించారు.డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం పూర్తి అయిన తర్వాత లబ్ధిదారులు ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

స్పందించిన ఎమ్మెల్యే...

సిపిఎం వినతికి స్పందించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇళ్ల నిర్మాణం పూర్తిచేసాకనే లబ్ధిదారులకు ఇస్తామని హామీ ఇచ్చారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం ముప్పై ఆరు మంది ఒక బ్లాకులో ఉండే విధంగా నిర్మాణం చేపట్టారని, వారికి కేటాయించిన ఇల్లు నిర్మాణం ఎంతవరకు అయిందో చూసి మిగతా ఇంటి నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరి లక్ష్మి,టౌన్ కమిటీ సభ్యులు మందా నాగకృష్ణ నాయకులు రాజేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తిరుమలాయపాలెం ఎస్సైకు తీవ్ర గాయాలు

**క్షతగాత్రులను పరామర్శించిన తుంబూరు దయాకర్ రెడ్డి**



**తిరుమలాయపాలెం, (జనంసాక్షి) :** వినాయక నిమజ్జనం సందర్భంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్‌తో పాటు డ్రైవర్ కొత్తపల్లి రాకేష్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో ఖమ్మం?వరంగల్ జాతీయ రహదారిపై తిరుమలాయపాలెం పరిసర ప్రాంతంలోని భవాని హోటల్ సమీపంలో చోటుచేసుకుంది. పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసు వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ఎస్సై జగదీష్, ప్రైవేట్ డ్రైవర్ రాకేష్ గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను ఖమ్మం పట్టణంలోని స్తంభాద్రి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎస్సై జగదీష్‌కు గాయాలు కాగా, డ్రైవర్ రాకేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, స్తంభాద్రి ఆసుపత్రికి చేరుకుని ఎస్సై జగదీష్, డ్రైవర్ రాకేష్‌లను పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని కోరారు. ముఖ్యంగా డ్రైవర్ రాకేష్ పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకున్న తుంబూరు దయాకర్ రెడ్డి, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాకేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రాకేష్ కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తామని తెలిపారు.

## ఐఎఫ్ టియు ఆశయాలతో పోరాడేవారే పాషన్నకు అనుచరులు

**❍కార్మిక వ్యతిరేక విధానాలపై పాషా స్ఫూర్తితో పోరాడాలి ❍ఐఎఫ్ టియుఉపాధ్యక్షు లు జే.సీతారామయ్య.**



**భద్రాద్రి కొత్తగూడెం,సెప్టెంబర్ 24(జనంసాక్షి):** శ్రమ దోపిడీకి వ్యతిరేకం గా పోరాటలక్ష్యాన్ని ఎంచుకొని కార్మిక ఉద్యమాలు సాగాలని నేడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు కార్పొరేట్లకు దాసోహం చేసేలా కార్మికులకు వ్యతిరేకనీగా ఉన్నాయని ఇలాంటి సందర్భంలో కార్మికవర్గ పక్షపాతిగా నిలబడి ఎన్నెన్నో పోరాటాలు చేసిన ఆదర్శ కార్మికనేత కామ్రేడ్ ముక్తార్ పాష అంకిత భావాన్ని కార్మికవర్గం ఆదర్శంగా తీసుకొని పోరాటాలు సాగించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్ టియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. సీతారామయ్య అన్నారు. పాషన్న అనుసరించిన మార్గమే కార్మికుల కష్టాల విముక్తికి, శ్రందోపిడిరద్దుకు మార్గమని కార్మికవర్గ రాజ్య స్థాపనకు సరయిన దారని ఆయన అన్నారు. ఐఎఫ్టియుజాతీయప్రధాన కార్యదర్శి ముక్తార్ పాష 2020 నమరణించారు.కా.పాషన్న 6వ వర్ధంతి సభను రైటర్ బస్తి ఐఎఫ్టియు ఆఫీసులో నిర్వహించారు. సభకు ఐఎఫ్టియు ఏరియా అధ్యక్షులు మోత్కూరి మల్లికార్జున రావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణి, హమాలి,మున్సిపల్,టైల్స్, కాంట్రాక్ట్,షాప్ ఎంప్లాయిస్, రిక్షా,సినిమా,క్వారీ,పవర్ గ్రిడ్, స్టీల్ ప్లాంట్ తదితర అనేక విభాగాల పనిచేస్తున్న కార్మికులకోసం కార్మిక సంఘాలు ఏర్పాటుచేశాడని చట్టబద్ధ హక్కులు సౌకర్యాలను సాధించి పెట్టాడని,సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు,ఓపెన్ కాస్ట్ ఓబిలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, సులబ్ కార్మికులు,మోటార్ కార్మికులు,ఆటో కార్మికుల కోసం రాజీలేని పోరాటాలను నిర్వహించి అనేక విజయాలను సాధించి పెట్టాడని ఆయన వివరించారు.అంచలంచెలుగా ఎదిగి ఐఎఫ్టియుకు జాతీయ ప్రధాన కార్యదర్శి గా అత్యున్నత బాధ్యతలోకి చేరాడని ఇది ఆయన కార్మికుల పక్షాన నిలబడి అంకితభావంతో పనిచేయటం,కార్మికుల విశ్వాసాన్ని పొందటం అనేది పాష నిర్వహించిన కార్మికవర్గ పక్షపాత ధోరణి, సమస్యల ఎడల రాజీలేని వైఖరిని అనుసరించటం వల్లనే సాధ్యమైందని అన్నారు.కామ్రేడ్ పాషా జీవితంకార్మిక వర్గానికి ఆదర్శప్రాయమని ఐఎఫ్టియుకు కార్మిక వర్గానికి అంకితమైన పాషా జీవితం అందరికీ ఆదర్శంగా అనుచరణీయంగా ఉండాలని అన్నారు. లక్ష్యాలు ఆశయాలకు ద్రోహం చేసి ఐఎఫ్ టియు పేరునే మార్చుకున్న సంస్కరణవాద,రివిజనిస్టు సంస్థలు ఆయన సంతాప సభలను నిర్వహించడం ఆయనకు వారసులమని చెప్పుకోవడం పులినిచూసి నక్క వాతలు పెట్టుకున్నట్ల గా ఉందని,ఆయన చరిత్రకు మసిపూయాలని ఆయన పేరును వాడుకునే శక్తుల యెడల కార్మిక వర్గం మెలుకువగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.ఐఎఫ్ టియు ఆశయాల సాధన లక్ష్యంగా ఎంచుకొని పోరాడేవారే కామ్రేడ్ పాషకు నిజమైన అనుచరులుగా ఉంటారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు రాష్ట్ర కమిటీ సభ్యులు గౌని నాగేశ్వరరావు,ఐ ఎఫ్ టియు కొత్తగూడెం ఏరియా కార్యదర్శి నెమిల్ల సంజీవ్,.జిఎల్ బికేఎస్ రాష్ట్ర కార్యదర్శి కాపుకృష్ణ,ఆర్గనైజింగ్ సెక్రెటరీ గందూరి సంజీవ రావు,ఆటో అండ్మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎల్. మారుతి రావు,మల్లేష్,వాసు,శరత్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడి ఆస్తుల జప్తు

కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్24 (జనం సాక్షి): ప్రభుత్వం నిషేధించిన గంజాయిని అక్రమంగా కొనుగోలు చేసి రవాణా చేస్తూ పట్టుబడిన నింది తుడి ఆస్తులను, అతని భార్య బ్యాంక్ ఖాతాను ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా జప్తు చేసినట్లు ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. తేదీ 28.08.2025న ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌లో నమోదైన nCr.No.136/2025, U/Sec 8(C) r/w 20(b)(ii)(C), 27(A), 29 of NDPS Act-1985 కేసులో నిందితుడు పల్లపు రఘు అక్రమ గంజాయి రవాణా ద్వారా సంపాదించినట్లు గుర్తించిన ఆస్తులపై ఆర్థిక దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడి పేరుతో ఉన్న రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్, అలాగే అతని భార్యకు సంబంధించిన బ్యాంక్ ఖాతాను చెన్నై కాంపిటెంట్



అథారిటీ ద్వారా ఫ్రీజింగ్ ఆర్డర్ పొందిన అనంతరం, న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు జప్తు చేసినట్లు సీఐ వెల్లడించారు. జప్తు చేసిన ఆస్తులు, బ్యాంక్ ఖాతా విలువ మొత్తం సుమారు రూ.21,15,907/-గా ఉన్నట్లు తెలిపారు.

**ఆస్తులు జప్తు చేయబడిన నిందితుడి వివరాలు:**

పల్లపు రఘు, S/o ఎల్లయ్య, వయస్సు 35 సంవత్సరాలు, వృత్తి: కారు డ్రైవర్, స్వస్థలం: మండేపల్లి గ్రామం, చిన్నకోడూర్ మండలం, సిద్దిపేట జిల్లా. ప్రస్తుతం ఉప్పల్, హైదరాబాద్‌లో నివాసం.

గంజాయి అక్రమ కొనుగోలు, రవాణా వంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు, నేరాల ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి జప్తు చేసేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిని అరెస్టు చేయడమే కాకుండా, నేరం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి జప్తు చేసేలా సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టిన ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## గురుకులాల్లో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

**- ఈనెల 26న సంబంధిత పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు.**

**- ఐటీడీఏ పీవో బి.రాహుల్**



**భద్రాచలం సెప్టెంబర్ 24 (జనంసాక్షి)**
తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు, జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 26న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. 2026?27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశం కోరుకునే విద్యార్థులు ఈనెల 26న ఉదయం 10 గంటలకు సంబంధిత గురుకుల పాఠశాల లేదా కళాశాలలో హాజరు కావాలని సూచించారు. ఖాళీగా ఉన్న సీట్లను నిబంధనల ప్రకారం భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రవేశానికి వచ్చే విద్యార్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని సూచించారు. గురుకులాల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం ద్వారా ఉచితంగా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్లు పీవో తెలిపారు. అర్హత కలిగిన గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాలుర గురుకులాలు: దమ్మపేట, కిన్నెరసాని, గుండాల, సింగరేణి, తిరుమలాయపాలెం, కృష్ణసాగర్. బాలికల గురుకులాలు: భద్రాచలం, సుదిమళ్ల, మణుగూరు, కొత్తగూడెం, వైరా, అంకంపాలెం, అన్నపురెడ్డిపల్లి. ఇంటర్ గ్రూపులు: ఖాళీలను బట్టి ఎంపీసీ, బైపిసి, సి ఈ సి, హెచ్ ఈ సి, ఎం ఇ సి, సి ఎస్ ఈ తదితర గ్రూపుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.

# జర్నలిస్టులకు అండగా నిలబడే దమ్మున్న యూనియన్ టి జె ఎఫ్ దే

### వచ్చే నెల మొదటి వారంలో ఖమ్మం డివిజన్ మహాసభలు :టీజెఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి

**ఖమ్మం సెప్టెంబర్ 24, (జనంసాక్షి) :**
జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా టీజెఎఫ్ అండగా ఉంటుందని, జర్నలిస్టుల కోసం నిలబడి కలబడే దమ్మున్న జర్నలిస్ట్ యూనియన్ టీజెఎఫ్ దే అని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీజెఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన టి యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) నగర కమిటీ, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రెస్ క్లబ్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమా వేశం లో చిర్రా రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసిన చరిత్ర తమ యూనియన్ దేనని, కష్టాల్లో ఉన్న వారికి ఆర్థిక సహాయం చేయడంతో పాటు కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో జర్నలిస్టులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. అక్రిడేషన్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల కోసం రాజీ లేని పోరాటాలు చేసిన ఘనత తమదే అన్నారు. వచ్చే నెల మొదటి వారంలో టి జె ఎఫ్ ఖమ్మం డివిజన్ మహాసభలు ఖమ్మంలో నిర్వహిస్తున్నామని, ఈ సభలను విజయవంతం చేసేందుకు జర్నలిస్టు మిత్రులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఫెడరేషన్




యూనియన్ నుంచి వి5 బ్యూరో ఇన్చార్జ్ కెవి, విజన్ ఆంధ్ర బ్యూరో ఇన్చార్జ్ రామకృష్ణ,అశోక్, నాగేశ్వరరావు తదితరులు టీజేఎఫ్ యూనియన్ లో చేరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, అక్రిడేషన్ కమిటీ సభ్యులు నాగరాజు, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు య లమందల జగదీష్, కరీష అశోక్,ఫోటోగ్రాఫర్ రవి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు,కోశాధికారి బిక్కి గోపి, ఉపాధ్యక్షులు పి. పానకాలరావు, ముత్యాల కోటేశ్వరరావు, పులి శ్రీను,రేపాక యాదగిరి, హుస్సేన్, సహాయ కార్యదర్శులు బోనగిరి యాదగిరి ఉల్లోజు రమేష్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, రవీందర్, మీడియా ఇన్చార్జ్ తిరుపతిరావు, మహిళ ప్రతినిధులు వంగూరి ఈశ్వరి, రోజా, మాధవి, కిరణ్మయి, శ్రీదేవి, నాగలక్ష్మి, సీనియర్ నాయకులు ఉత్కంఠం శ్రీను, సాయి కళ్యాణ్, ఎన్ టి వి సాయి, గౌరీ శంకర్, గోవింద్, నాగ శేఖర్, పెంటి వెంకటేశ్వర్లు, రవి,లింగయ్య, నరసింహ రావు, భద్రం, రాంబాబు, లక్ష్మణ్, వెంకన్న, నాగరాజు, కూరపాటి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## మారెళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

**రేగా కాంతారావు కృషితోనే పథకం సాకారం బీఆర్ఎస్ నాయకులు**

**అశ్వాపురం, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
మారెళ్లపాడులో ఇటీవల ప్రారంభమైన ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లుమల్లారెడ్డి, సీనియర్ నాయకులు జాలే రామకృష్ణారెడ్డి, గొర్రెముచ్చు వెంకట రమణ సందర్శించారు. తుమ్మలచెరువు ప్రాంతానికి అందనున్న సాగునీటి ప్రయోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో సాగునీటి రంగానికి పెద్దపీట వేశారని, సీతారామ ప్రాజెక్టులో భాగంగా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం కీలకమన్నారు. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కృషి, ప్రభుత్వంపై తీసుకువచ్చిన ఒత్తిడి ఫలితంగానే పథకం సాకారమైందని తెలిపారు. ఈ పథకంతో స్థానిక రైతులకు సాగునీటి భరోసా పెరగడంతో పాటు వ్యవసాయానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు.



# యాదాద్రి థర్మల్ ప్లాంట్ బిఆర్ఎస్ నాయకులు ఎటిఎం లా వాడుకున్నారు..

### బీఆర్ఎస్ పాలనలో కమిషన్లు, బినామీ కాంట్రాక్టుల పేరుతో వేలకోట్లు దోచుకున్నారు : ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**జనంసాక్షి, మిర్యాలగూడ :**
యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్)ను బి ఆర్ ఎస్ నాయకులు ఎటిఎం లా వాడుకున్నారని, బినామి కాంట్రాక్ట్ ల పేరుతో వేలకోట్ల రూపాయలు దోచుకున్నా రని, నిర్మాణం, భూ సేకరణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆరోపించారు. దామరచర్ల మండలం వీర్లపాలెంలోని వైటీపీఎస్ వద్ద గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు గనులకు దూరంగా ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల ప్రస్తుతం బొగ్గు రవాణాకు భారీగా అదనపు వ్యయం అవుతోందని విమర్శించారు. బొగ్గు లభ్యత, ప్లాంట్ స్థానం వంటి అంశాలపై ప్రస్తుతం ప్రభుత్వ స్థాయిలోనూ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక సమీక్షలో బొగ్గు రవాణా వల్ల సుమారు రూ.40 వేల కోట్ల అదనపు భారం పడు తోందని అధికారులు తెలిపినట్లు వెల్లడైంది. కాళేశ్వరం కేసిఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారితే వైటీపీఎస్ జగదీశ్‌రెడ్డి, నల్లమోతు భాస్కరరావులకు ఏటీఎంగా మా రిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి పేరుతో రాజకీయ ఫిరాయింపులు ప్రోత్సహించి, ప్లాంట్ నిర్మాణం లో కమిషన్లు దండుకున్నారని ఆరోపించారు. వైటీపీఎస్ కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు మాత్రం పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానిక నిర్వాసితుల ప్రయోజనాలను పక్కనపెట్టి బీఆర్ఎస్ నాయకుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇప్పించుకున్నారని ఆరోపించారు. భూనిర్వాసితులకు అర్హత మేరకు ఉద్యోగాలు, ఇతర ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రశ్నలు ఎదుర్కొంటున్న వారు ఇప్పుడు పవర్‌ప్లాంట్ వద్దకు వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. నిర్మాణంలో ఉన్న యూనిట్లను పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రజల ప్రయోజనాల కోసం తాను నిరంతరం పోరాడుతానని బత్తుల లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ లు నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ బాలుర వసతిగృహంలో వైద్య శిబిరం

○పరిశుభ్రతే ఆరోగ్యానికి శ్రీరామరక్ష
○విద్యార్థులకు ఉచితంగా మందుల పంపిణీ
○మామిళ్లగూడెం వైద్యాధికారి డాక్టర్ ఎన్.కృష్ణచైతన్య

**ఖమ్మం, (జనంసాక్షి) :**
విద్యార్థులు చిన్నతనం నుంచే వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణం, అలవాట్లే సర్వరోగ నివారిణిగా పనిచేస్తాయని మామిళ్లగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ ఎన్.కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. నగరంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహం (బి)లో గురువారం విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్షుణ్ణంగా సాధారణ ఆరోగ్య పరీక్షలు చేపట్టి, వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించారు. అనంతరం స్వల్ప అస్వస్థతతో ఉన్న పలువురు విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణచైతన్య విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ.. నిత్య జీవితంలో పరిశుభ్రత ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా స్నానం చేయడం, ఉతికిన శుభ్రమైన దుస్తులు ధరించడం, భోజనానికి ముందు, మలమూత్ర విసర్జన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటివి తప్పనిసరి చేసుకోవాలని సూచించారు. గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలని, రోజుకు రెండుమార్లు దంతధావనం చేయడం ద్వారా నోటి సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చని స్పష్టం చేశారు. పరిశుభ్రత లోపిస్తే సులభంగా అంటువ్యాధుల బారినపడే ప్రమాదముందని, ఆరోగ్యకరమైన అలవాట్లతోనే వ్యాధులను సమర్థంగా అడ్డుకోవచ్చని విద్యార్థుల్లో చైతన్యం నింపారు. చదువుతో పాటు దేహ దారుఢ్యం, ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి కోటపాటి రుక్మారావు, మామిళ్లగూడెం యూపీహెచ్‌సీ ఏఎన్ఎంలు ఎస్.దయామణి, కె.హేమలత, వసతిగృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## సాయిబాబా ఆలయానికి రూ.3.5 లక్షల విలువైన రథం బహూకరణ.,

**- తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..**

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 24 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాకలోని షిరిడి పుష్కర ద్వారక సాయిబాబా ఆలయానికి తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.3.5 లక్షల విలువైన రథాన్ని బహూకరించారు. గురువారం ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ- విజయరేణుక దంపతులు ఆలయాన్ని దర్శించుకుని, అనంతరం రథాన్ని ఆలయ కమిటీ బాధ్యులకు అందజేశారు. తన కుమారుడు, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్?నీలిమ దంపతుల సౌజన్యంతో స్వామివారికి రథాన్ని సమర్పించినట్లు ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగమనేని భాస్కర్రావు, తీగల జీవన్‌రెడ్డి, ఊటుకూరి రమణమూర్తి, అక్కెర భాస్కరాచారి, కొత్తపల్లి సత్యనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఏఐ, సోషల్ మీడియాపై వర్క్‌షాప్

**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 24,(జనంసాక్షి):**
నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అక్టోబర్ 3న నల్లగొండ డివిజన్ పరిధిలోని జర్నలిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ంఐ), సోషల్ మీడియాపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు.ఈ వర్క్‌షాప్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా రంగాల్లో నిష్ణాతులైన రిసోర్స్ పర్సన్లు హాజరై జర్నలిస్టులకు అవగాహన కల్పించనున్నారు. ఉదయం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాయంత్రం సోషల్ మీడియా అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.నల్లగొండ డివిజన్ పరిధిలోని జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు కోరారు.

## చింతలపాలెం గ్రామంలో డ్రైనేజీల శుభ్రత కార్యక్రమం



**చింతలపాలెం(జనంసాక్షి)**
చింతలపాలెం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా డ్రైనేజీలలో చెత్తాచెదారం,మట్టి పేరుకుపోయి నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. గ్రామస్తులు ఈ సమస్యను గ్రామపంచా యతీ దృష్టికి తీసుకురావడంతో తక్షణ మే స్పందించి జేసీబీ సహాయంతో డ్రైనేజీలను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు.డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్త,మట్టిని తొలగించి నీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ రామకోటి రెడ్డి,ఉపసర్పంచ్ జంగాల అంతమ్మ పుల్లయ్య పాల్గొని డ్రైనేజీ శుభ్రత పనులను పర్యవేక్షించా రు.గ్రామస్తుల సమస్యలను తక్షణమే పరిష్కరించేం దుకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంద ని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ దేవాలయ చైర్మన్ అంకిరెడ్డి,షేక్ రియాజ్ చింత్రాల బిచ్చం మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## జాజిరెడ్డిగూడెం మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఎంపీడీవో పల్లపు ఝాన్సీ

**జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్ 24 (జనంసాక్షి)**
భారీ వర్షాలతో కోడూరు, కొమ్మాలలోని రహదారులపై వరద భారీగా ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జాజిరెడ్డిగూడెం మండల ఎంపీడీఓ పల్లపు ఝాన్సీ కోరారు. వర్షాలకు తిమ్మాపురం-సంగెం రహదారిపై వరద మూలంగా రాకపోకలు నిలిచిపోవడంతో కోడూరు, కొమ్మాలలోని వాగులను గురువారం పరిశీలించారు. అలాగే తిమ్మాపురంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్ళలో నివాసముంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వర్షాలు తగ్గే వరకు శిథిలమైన ఇళ్ల వద్దకు రావద్దని సూచించారు. కోడూరు వద్ద వాగులో నుంచి ప్రయాణం చేయవద్దని ప్రజలను కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచులు కుంటిగొర్ల శ్రీనివాస్, బోడ్డు ఇందిరసోమరాజు, జీపీఓలు దేవేందర్, షరీఫ్, కార్యదర్శులు ఫర్హాన, జ్యోతి, ఉపసర్పంచ్ సందీప్ రెడ్డి, ఉపేందర్, వెంకన్న, ఆయా గ్రామ పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

## లక్కీడ్రాలో ఎలక్ట్రిక్ బైక్ గెలుపు

**సూర్యాపేట (జనంసాక్షి):**
వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని 25వ వార్డు సీతారాంపురంలో గురువారం లక్కీ డ్రా నిర్వహించారు.
ఉత్కంఠగా సాగిన లక్కీ డ్రాలో సీతారాంపురానికి చెందిన సయ్యద్ జైన, నసురుద్దీన్ ఎలక్ట్రిక్ బైక్ ను గెలుచుకున్నారు.లక్కీ డ్రా లో ఎలక్ట్రిక్ బైక్ తమకు రావడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పర్సనబోయిన సైదులు, సామాని, అశోక్, నాగయ్య, సైదులు, అంజయ్య, కృష్ణ, శ్రీరాం, ప్రసాద్, తరుణ్, విక్కీ, మహేష్, బబ్లు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షాలు.. భద్రాచలం డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- గోదావరి నీటిమట్టం పెరిగే అవకాశం..**

**- అత్యవసరమైతేనే ప్రయాణాలు..- సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట..**

**భద్రాచలం సెప్టెంబర్ 24 (జనంసాక్షి)**
భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భద్రాచలం డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట సూచించారు. గోదావరి నది నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నందున గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప అనవసర ప్రయాణాలను నివారించాలని సూచించారు. చెరువులు, కుంటలు, కాలువలు, వాగులు, నదులు తదితర నీటి వనరుల వద్దకు వెళ్లవద్దని, చేపలు పట్టడం, ఈత కొట్టడం, స్నానం చేయడం వంటి వాటి కోసం నీటిలోకి దిగకూడదని హెచ్చరించారు. పిల్లలు నీటి వనరుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, కాజ్‌వేలు, నీరు ప్రవహించే రహదారుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో చెట్ల కింద నిలబడవద్దని పేర్కొన్నారు. అధికారులు జారీ చేసే సూచనలు, ఆదేశాలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సబ్ కలెక్టర్ కోరారు.





**రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారదకు శుభాకాంక్షలు**

జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి)
రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా నియమితులై బాధ్యతలు చేపట్టిన నేరెళ్ల శారదను గురువారం హైదరాబాద్‌లో మండలంలోనిఅడివెల గ్రామానికి చెందిన మహిళా కాంగ్రెస్ రాష్ట్రఉపాధ్యక్షురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మహిళా కమిషన్‌లో పనిచేసిన శారద రాష్ట్రమహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేసి మహిళా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేశారని చెప్పారు. మహిళా నాయకత్వాన్నిప్రోత్సహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడుమహేష్ కుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## భారీ వరదలతో ప్రమాదకరంగా మారిన కోడూరు వాగు

**జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్ 24 (జనంసాక్షి)**
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం-సంగెం రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఈ రహదారిపై తిరిగే మూడు మండలాల ప్రజల రాకపోకలు ఆగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి విస్తరణలో భాగంగా కోడూరు వద్ద వదల నిర్మాణం జరగక ప్రజల ఇబ్బందులు తీరని పరిస్థితి నెలకొంది.



# మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో విచారణ

## బాధితులందరి వాంగ్మూలాలు సేకరిస్తారా?



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):**
మానవ హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ వరంగల్ పర్యవేక్షణ ఇంజినీర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విచారణపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది. విచారణలో బాధితులందరినీ పిలిచి వాంగ్మూలాలు సేకరిస్తారా? గతంలో వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటారా? అనే చర్చ జరుగుతోంది.గతంలో కొత్తగూడెం డివిజన్ ఇంజినీర్‌పై సహాయ కార్యనిర్వహణ ఇంజినీర్ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన కేసులో భాగంగా వరంగల్ నుంచి పర్యవేక్షణ ఇంజినీర్ రెండుసార్లు విచారణకు వచ్చినట్లు ఉద్యోగులు పేర్కొంటున్నారు. అయితే ఆ రెండు సందర్భాల్లో ఎవరిని పిలిచారు, ఏ అంశాలపై విచారణ చేపట్టారనే విషయం పలువురు ఉద్యోగులకు స్పష్టంగా తెలియదని అంటున్నారు.జిల్లా అధికారిగా డివిజన్ ఇంజినీర్ పనిచేసిన సమయంలో పలు ఫిర్యాదులు వచ్చినప్పటికీ వాటిపై సమగ్ర విచారణ జరగలేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. డివిజన్ ఇంజినీర్‌కు అనుకూలంగా వచ్చిన ఫిర్యాదులపై విచారణకు ఆదేశాలు ఇచ్చి, వ్యతిరేకంగా ఉన్న ఫిర్యాదులను పక్కన పెట్టారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.ప్రస్తుతం జరుగుతున్న పర్యవేక్షణ ఇంజినీర్ విచారణలో డివిజన్ ఇంజినీర్‌పై వచ్చిన అన్ని ఫిర్యాదులు, బాధితులు, సాక్షుల వాంగ్మూలాలు, సంబంధిత పత్రాలు, పత్రికల్లో వచ్చిన కథనాలను కూడా పరిశీలించాలని విద్యుత్ ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఒక ఉద్యోగిపై ఫిర్యాదు వచ్చినప్పుడు అనుసరించే విచారణ విధానమే అధికారిపై వచ్చిన ఫిర్యాదుల విషయంలోనూ ఉండాలని ఉద్యోగులు కోరుతున్నారు.ఈ విషయమై విచారణ అధికారి తిరుపతిని వివరణ కోరగా, "బాధితులు 50 మందికి పైగా ఉన్నారు. వారందరినీ విచారించి పూర్తి సమాచారాన్ని సేకరిస్తాం. ఇందులో సాక్షులు కూడా ఉన్నారు" అని తెలిపారు.అయితే ఈ విషయమై జిల్లా ప్రతినిధి మరోసారి విచారణ అధికారి తిరుపతిని వివరణ కోరగా, "చిన్న పత్రికలో వచ్చిన కథనం ఆధారంగా విచారణ చేయాల్సిన అవసరం లేదు. మాకు అందిన ఫిర్యాదులు చాలా ఉన్నాయి. విచారణ నెమ్మదిగా కొనసాగుతుంది. పలువురు బాధితులు మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లో ఉన్నారు. త్వరలో వచ్చి మళ్లీ విచారణ చేపడతాం" అని తెలిపారు.



# వినాయక శోభాయాత్ర పాల్గొన్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య

**మాడుగులపల్లి, సెప్టెంబర్ 24 ( జనంసాక్షి):**
నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం ఇసుకబావిగూడెం గ్రామంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నిమ్మల నవీన్ రెడ్డి వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య ఇసుకబావిగూడెం గ్రామానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో నిమ్మల గోవిందమ్మ సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఇసుకబావిగూడెం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు అలాగే నిమ్మల నవీన్ రెడ్డి ఈ గ్రామానికి, మండల ప్రజలకు చేసిన సేవలను ఆయన కొనియాడారు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నిమ్మల నవీన్ రెడ్డి మాట్లాడుతూ మండల ప్రజలందరికీ మరియు గ్రామస్తులకు వినాయక చవితి, శోభాయాత్ర శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం ఇసుకబావిగూడెం గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో వినాయక శోభాయాత్రను గ్రామంలో అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జేరిపోతుల రాములు గౌడ్, మాజీ సర్పంచ్ నిమ్మల గోవిందమ్మ, లలిత సీతారాం రెడ్డి, ఉప సర్పంచ్ సంధ్య చంద్రశేఖర్, కందిమల్ల విక్రమ్ రెడ్డి, పుట్ట సైదులు, కేతనపల్లి ఎల్లారెడ్డి,పుట్ట శ్రీను,పోతురాజు యాదయ్య, పోతురాజు శ్రీనివాస్, అరుణ్, నాయకులు, గౌడ సంఘం శేష గాని వెంకన్న,పుట్ట బిక్షం,పుట్ట వెంకన్న, పుట్ట రాజయ్య భక్తులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈశ్వర్ నేత్రాలయ ఆసుపత్రిని వారు ప్రారంభించి మాట్లాడారు.కంటి సమస్యలకు నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు.నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని అన్నారు.ప్రజలకు అవసరమైన వైద్య సేవలను స్థానికంగానే అందించేందుకు మరిన్ని వైద్య సంస్థలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. వైద్యులు సేవా దృక్పథంతో పనిచేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలను అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బొమ్మిడి క్రాంతి, డాక్టర్ నరేష్, బొమ్మిడి రవీందర్, డి.లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# లక్కీడ్రా లో బుల్లెట్ బైక్ గెలుచుకున్న పూజిత మల్లేష్

**సూర్యాపేట (జనంసాక్షి)**
గణనాథుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మొరిశెట్టి లక్షాది, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి,మాజీ కౌన్సిలర్ పోలగాని బాలుగౌడ్ అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో పీఎస్ఆర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు.యువత ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తుల్లో మరింత ఉత్సాహం నెలకొంటుందని పేర్కొన్నారు.అనంతరం నిర్వహించిన లక్కీ డ్రాలో కేసారం గ్రామానికి చెందిన బత్తుల పూజిత మల్లేష్ బుల్లెట్ బైక్‌తో పాటు 21 కిలోల లడ్డూను గెలుచుకున్నారు.శ్రీరాం సాయిరాం సంధ్య దంపతులు 26 కిలోల లడ్డూను రూ.33 వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు మురళీ చంటి, నరేష్, సైదులు, గణేష్, సాయిదీప్, మహేష్, నవీన్, వంశీ, శ్యామ్, కిషోర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# నిండుకుండలా తలపిస్తున్న చెరువులు

## అలుగు పోస్తున్న గుండ్ల సింగారం కతువ

**నూతనకల్ సెప్టెంబర్ 24(జనంసాక్షి)**
నూతనకల్ మండల వ్యాప్తంగా అల్పపీడన ద్రోణ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం పాలేరు వాగుపై ఉన్న గుండ్ల సింగారం కతువ నిండుకుండలా నిండి అలుగు పోస్తుంది.



ప్రాజెక్టు ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.అన్ని గ్రామాలలో చెరువులు కుంటలు వాగులు నిండుకుండలా తలపిస్తున్నాయి. ఎండిపోతున్న పొలాలకు ఈ అల్పపీడన ద్రోణ ప్రభావంతో భారీ వర్షాలు కురవడం వలన సూర్యాపేట జిల్లాలోనే నూతనకల్ మండలలో అత్యధిక వర్షపాతం నమోదు అయినదని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా మండలంలోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# చాకలి ఐలమ్మ జయంతి వేడుకలకు బుచ్చయ్యకు ఆహ్వానం

**ఆత్మకూరు (ఎం) జనంసాక్షి సెప్టెంబర్ (24)**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఈ నెల 26న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వేడుకలకు ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన రజక సంఘం రాష్ట్ర నాయకులు ఎలిమినేటి బుచ్చయ్యకు ఆహ్వానం అందింది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వేడుకలకు తనకు ఆహ్వానం అందడం సంతోషంగా ఉందని బుచ్చయ్య తెలిపారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.



పి.ఏ.పల్లి మండల కేంద్రంలో గణేష్ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా గణనాథుని లడ్డు ను వేలం పాటలో ధర్మాపురం దేవేందర్ (చంటి ) – శిరీష దంపతులు 51,116 రూపాయలకు దక్కించుకోవడం జరిగింది.

**జనంసాక్షి , పి.ఏ.పల్లి**



# దొండపాడులో వాగు వరద ప్రవాహాన్ని పరిశీలించిన అధికారులు

**చింతలపాలెం(జనంసాక్షి)**
చింతలపాలెం మండలం,దొండపాడు గ్రామంలో వాగు వరద పరిస్థితిని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి, ఎంపీవో భూపాల్‌రెడ్డి గురువారం పరిశీలించారు.వాగులో వరద ప్రవాహాన్ని పరిశీలించి,గ్రామంలో పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ చెన్నకేశి వెంకయ్య, ఉపసర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సైదులు, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ కిరణ్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాలో 11 ఆహార భద్రతా కేసుల పరిష్కారం..

# 2.90 లక్షల జరిమానా

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి)
ఖమ్మం జిల్లాలో ఆహార భద్రతా ప్రమాణాల అమలులో భాగంగా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సమక్షంలో, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సి. హెచ్. లోకేష్ ఆధ్వర్యంలో నమోదైన 11 కేసులను పరిష్కరించి, సంబంధిత ఆహార వ్యాపార సంస్థలపై మొత్తం ?2,90,000/- జరిమానా విధించారు.

**జరిమానా విధించిన ముఖ్యమైన సంస్థలు:**
రమేష్ ధాబా - 1 లక్ష ,హవేలీ - 75 వేలు,రిలయన్స్ రిటైల్ - 50 వేలు,డిలైట్ మండీ - 20 వేలు ,జాజూ - 20 వేలు,
ఇతర కేసులు - మిగిలిన జరిమానా
ఆహార వ్యాపార సంస్థలు పరిశుభ్రత, నాణ్యత మరియు ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఖమ్మం జిల్లా ఆహార భద్రతా శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు, నమూనాల సేకరణ మరియు అమలు చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీ సి. హెచ్. లోకేష్ తెలిపారు.



## భద్రాద్రి రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

భద్రాచలం సెప్టెంబరు 24 (జనంసాక్షి)
భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గురువారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్ర?బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు.

## పీడియాట్రిక్స్ పీజీ సీట్లపై ఎన్ ఎంసీ తనిఖీ

భద్రాచలం సెప్టెంబరు 24 (జనంసాక్షి)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో పీడియాట్రిక్స్ విభాగానికి ప్రతిపాదించిన నాలుగు పీజీ సీట్లకు సంబంధించి గురువారం జాతీయ వైద్య కమిషన్ (ఎన్ ఎంసీ) తనిఖీ నిర్వహించింది. చెన్నై ప్రభుత్వ కిల్ పాక్ మెడికల్ కాలేజీకి చెందిన పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎజిలరసు రామలింగం తనిఖీ అధికారిగా ఆస్పత్రిలోని వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది, బోధనా వసతులు, వైద్య పరికరాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పీజీ వైద్య విద్యార్థులకు అవసరమైన బోధనా సౌకర్యాలు, క్లినికల్ సేవలు, మౌలిక వసతులపై వివరాలు సేకరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖరరెడ్డి పర్యవేక్షణలో తనిఖీ ప్రక్రియ కొనసాగింది. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్ విభాగాల్లో నాలుగు చొప్పున మొత్తం 12 పీజీ సీట్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించారు. ఇందులో భాగంగా మూడు విభాగాల్లోనూ ఎన్ ఎంసీ తనిఖీలు పూర్తయ్యాయి. పీజీ సీట్లకు అనుమతులు లభిస్తే భద్రాచలం ప్రాంతంతో పాటు ఏజెన్సీ పరిధిలోని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందడంతోపాటు వైద్య విద్యకు కూడా ప్రాధాన్యం పెరగనుంది. తనిఖీలో పిల్లల వైద్యులు డాక్టర్ విజయరావు, డాక్టర్ క్రాపా విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో విఘ్నాలన్ని తొలగిపోవాలి

**పేపర్, మైదా,గడ్డితో పది అడుగుల వినాయక విగ్రహం తయారు చేసిన విఘ్నేష్**

సూర్యాపేట (జనంసాక్షి):
విఘ్నేశ్వరుని ఆశీస్సులతో విఘ్నాలన్ని తొలగిపోవాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ అన్నారు. సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని



కుడకుడలో మాజీ కౌన్సిలర్ వేములకొండ పద్మ సైదులు కుమారుడు విఘ్నేష్ న్యూస్ పేపర్, గడ్డి, మైదాతో తయారు చేసిన పది అడుగుల వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ కౌన్సిలర్ వేములకొండ పద్మ సైదులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా వినాయకుని విగ్రహాన్ని తయారుచేసిన విఘ్నేష్ ను అభినందించారు. గురువారం గణేష్ నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మొరిశెట్టి లక్ష్మాది, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, కాంగ్రెస్ నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్, నాగు నాయక్, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షానికి కూలిన చెట్టు రాకపోకలకు ఆటంకం తొలగించిన పత్రికా విలేకరులు



మాదుగులపల్లి, సెప్టెంబరు 24 ( జనం సాక్షి):
తోపుచర్ల నుండి ఇసుకబావిగూడెం వెళ్లే రహదారిపై రాత్రి సమయంలో కురిసిన అకాల వర్షం, ఈదురుగాలుల ధాటికి భారీ చెట్టు కూలిపడింది దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు విషయం తెలుసుకున్న జనం సాక్షి రిపోర్టర్ రాంబాబు, నమస్తే తెలంగాణ రిపోర్టర్ బొంగరాల శీను, ఆంధ్రప్రభ రిపోర్టర్ షేక్ రసూల్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు రాత్రి 10 గంటల సమయమైనప్పటికీ, ప్రయాణికులకు అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో స్వయంగా రంగంలోకి దిగారు స్థానికుల సహకారంతో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించి, మార్గాన్ని సుగమం చేశారు అర్ధరాత్రి వేళలోనూ సామాజిక బాధ్యతతో స్పందించి, ప్రయాణికుల కష్టాలను తీర్చిన విలేకరుల సమయస్ఫూర్తిని, సేవా నిరతిని స్థానిక ప్రజలు, వాహనదారులు కొనియాడారు.

## నేడు గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

# 6వ వర్ధంతి సభ

సూర్యాపేట (జనంసాక్షి):
నేడు జిల్లా కేంద్రంలోని బాలాజీ గ్రాండ్ హోటల్ బాంకెట్ హాల్ లో గంధర్వ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆరవ వర్ధంతి సభ మనం వికాస వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మనం వికాస వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సహకార అధికారి కనిగిరి శ్రీరామ్ ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథులుగా మీలా మహదేవ్, పెద్దిరెడ్డి రాజా హాజరు కానున్నారని,ఇరిగి కోటేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసే ఈ సభ కన్వీనర్ గా తోట శ్యామ్ ప్రసాద్ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ గాయకులు మధు బాపుశాస్త్రి, శ్రీదేవి బాలు పాటల సంగీత విభావరి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి గండూరి శంకర్ ,అప్పం శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది మేడిగే ఈశ్వర్ కుమార్, తీకుళ్ల సాయిరెడ్డి , డాక్టర్ మిన్న శివరామకృష్ణ, యామా ప్రభాకర్ , గాలి శ్రీనివాస్, న్యాయవాది శశిధర్, భువనగిరి భాస్కర్, డీఎస్పీ శర్మ, భాగ్యశ్రీ వెంకన్న, సకినాల కృష్ణ తదితరులు ఆత్మీయ అతిథులుగా రానున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు వ్యాఖ్యాతగా గుండా రమేష్ వ్యవహరిస్తారని తెలిపారు. పట్టణ ప్రజలు, సంగీతకారులు, గాయకులు, సంగీతాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సూర్యాపేట (జనంసాక్షి):
పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలను నాటి సంరక్షించాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది అన్నారు. జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట కంటి హాస్పిటల్లో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు నాటిన మొక్కలే రేపటి తరాలకు జీవనాధారమని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు లయన్స్ క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఐ హాస్పిటల్ చైర్మన్ మీలా మహదేవ్, గవర్నర్ గుడిపూడి వెంకటేశ్వరరావు, సెక్రటరీ పెండెం చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ మిర్యాల సుధాకర్, త్రివేణి హరి, సుధా బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణు, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్, నాగు నాయక్, పంతంగి దశరథ, పడిదల రవి, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి కూలిన వృద్ధురాలి పూరిగుడిసె

పెనుబల్లి సెప్టెంబర్ 24 (జనం సాక్షి )
గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెనుబల్లి మండలం ఎర్ర బంజర గ్రామపంచాయతీ రంగారావు బంజర గ్రామానికి చెందిన లింగ పోగు సీతమ్మ



పూరిగుడిసె కూలిపోయింది. సీతమ్మ భర్త చనిపోయి కుటుంబ సభ్యులకు దూరంగా ఒంటరిగా ఈ పూరి గుడిసెలో నివాసం ఉంటుంది వర్షాలకు పూరి గుడిసె కాస్త కూలిపోవడంతో నివాసాన్ని కోల్పోయింది. కూలిపోయిన పూరి గుడిసెను పంచాయతీ సర్పంచ్ రాజిని రాంబాబు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, గౌరారం జిపిఒ శ్రీనివాసరావు పరిశీలించారు. ఒంటరి వృద్ధురాలు అయిన సీతమ్మ తక్షణ సహాయం అందించాలని అధికారులను ప్రాధేయపడుతుంది.

## 108, 102 అంబులెన్సుల ఆకస్మిక తనిఖీ

**రికార్డులు, మందుల గడువు తేదీల పరిశీలన**

**పరికరాల పనితీరుపై నాణ్యత నియంత్రణ అధికారుల తనిఖీ**

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 24 (జనం సాక్షి)
అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో అందుబాటులో ఉన్న 108, 102 అంబులెన్సులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ నజీరుద్దీన్ నేతృత్వంలో రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ ఫకీర్ దాస్ అంబులెన్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా అంబులెన్సుల్లోని పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు అత్యవసర సేవలకు



వినియోగించే ఔషధాల గడువు తేదీలను పరిశీలించారు. అలాగే వాహనాల్లో ఏర్పాటు చేసిన వైద్య పరికరాల పనితీరును తనిఖీ చేసి, అవి ఎల్లప్పుడూ వినియోగానికి సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగవంతంగా, నాణ్యమైన సేవలు అందించేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా సమన్వయకర్త మనోహర్, 108 సిబ్బంది ఈఎంటీ కే. కళాధర్, పైలట్ పి. రాజా, 102 కెప్టెన్ సాయి తదితరులు పాల్గొన్నారు.